"సుబ్రహ్మణ్యం ఉన్నాడా?" అంటూ. మేమడిగిన మీదట ఆయన సుబ్రహ్మణ్యం పినమామగారని తెలిసింది.

"ఇంకా సుబ్రహ్మణ్యం రాలేదు. వచ్చే వేళఅయింది... సరేగాని మీ పిన్నల్లుడు ఎవతెనో పెట్టుకుని ఉంటున్నాడు. పెద్దవారు మీరన్నా చెప్పరాదా?" అని నేనన్నాను.

"ఎవతెనో పెట్టుకుని ఉండటమేమిటి, నీ మొహం! అది వాడి పెళ్లామే! నేనిప్పుడేగా వాడింటికి వెళ్లివస్తున్నదీ? వాడింటోనూ లేడు; ఏమైనాడో..." అని గొణుక్కుంటూ ఆ పెద్దమనిషి వెళ్లిపోయినాడు.

---

## రెండో పెళ్లి

[గల్పిక]

157533

శాపాచలంగారు ముప్ఫైతొమ్మిదో ఏట పదేళ్ల పిల్లని రెండోపెళ్లి చేసుకున్నాడు. ముప్ఫైతొమ్మిదేళ్లవాడికి పెళ్లాం అవసరమనేది శాపాచలంగారంగీకరించాడు గాని తనకన్న ఇరవైతొమ్మిదేళ్లు చిన్నదైన పెళ్ళాం ఆయనకు తృప్తికరంగా లేదు. తనకు ముప్ఫైపళ్లకన్య ఎట్లా దొరుకుతుందీ? దొరికితే మటుకు పెళ్లాడితే నలుగురూ ఏమంటారు? పోనీ. పెళ్లి చేసుకోకుండా ఉందామూ అంటే ఇతర విషయాలట్లాఉంచి తనకిన్ని నీళ్లు వదలటానికన్నా లేరే!

తీరా పెళ్లిఅయింతరవాత ఆలోచిస్తే నలుగురూ బలవంతాన తన పెళ్ళి చేసినట్టుగా తోచిందాయనకు.

TL
035,3NKR,K
35N45

"ఇంకా నలభై కూడా రాలేదుగా?'' అన్నారుకొందరు, ఇంకో సంవత్సరంలో తనకు వివాహ యోగ్యత లేకుండా పోయేట్టు.

''నీకు బుద్ధిఉందా! నీకన్న ముప్ఫయేళ్లు చిన్నపిల్లనేమని పెళ్ళాడావు!'' అన్నవాడు లేడు. రేపటినించీ ఆ మాట అననివాడూ ఉండడు.

పెళ్ళికిఎదిగిన పిల్లలు రెండు జాతులుంటే బాగుండును- తనకు ఈడయినవారిని చేసుకోదగినవాళ్లూ, ముసలి వాళ్లను మాత్రమే చేసుకోదగినవాళ్ళూ అంటూ! ఒక పిల్లకు చిన్న మొగుడే దొరుకుతాడో పెద్ద మొగుడే దొరుకుతాడో నిర్ణయించటానికి లేకపోవటం దారుణం.

లేదా చిన్నపిల్లల ఆటల్లో 'దొంగ' అనే మనిషిని నిర్ణయించటానికి కొన్ని నిబంధనలు పెట్టినట్టు, పెద్దవాళ్లకు చిన్నపిల్లల్ని అంట గట్టటానికికూడా కొన్నినిబంధనలువెడితే?

తన పెళ్ళాన్ని ఏ డెబ్భయ్యేళ్ళ మొగుడికో ఇవ్వాలని శాసనం జరిగిఉండి ఆమీదట తను—నలభై కూడా లేనివాడు—మొగుడైతే ఎంత సంతోషించేది!

ఆడవాళ్లింతలోకి ముసలాళ్లవుతార్లే? ఇద్దరి పిల్లల్ని కంటే తనభార్య మరోపదేళ్లలో అవ్వ అవుతుంది.

శాపాచలంగారనుకున్నట్లే పార్వతమ్మ ఇరవై ఏళ్లయినా రాకపూర్వమే ఇద్దరుపిల్లల్నికని నేవళం పోగొట్టుకొన్నది. ఆదంపతుల వయస్సులో తేడాగమనించటంకూడా మరిచారు ప్రజలు. చిన్నపిల్ల మొగుడుకావటంవల్లనో ఏమో శాపాచలంగారి పదిసంవత్సరాల కాలంలోనూ ఏమీమార లేదు—

తెల్ల వెంట్రుకలు జాస్తికావటంతప్ప.

ఇంకో ఇరవై ఏళ్లు గడిచినై. శాపాచలంగారు రాయల్లే ఉన్నాడు. ఒక చత్వారంలేదు, పల్లుకదలటంలేదు, నడుము నొప్పిలేదు, చెవుడులేదు. పార్వతమ్మ అప్పుడే రెండుదంతాలు పీకించి కళ్లజోడుపెట్టింది. ఆవిడతలకట్టు జనపనారపాళానికి వచ్చేసింది.

శాపాచలంగారు తన వివాహంగురించి ఒకప్పుడు పడ్డ దిగులంతా పూర్తిగా మరిచాడు.

వాళ్ల పెద్దబ్బాయి బి. యే. పాసయి, ఉద్యోగం సంపాదించి పైకొస్తున్నాడు. వాడుకథలూఅవీ రాస్తున్నట్టూ, వాటిని నలుగురూ బాగున్నవంటున్నట్టూ విని శాపాచలంగారు సంతోషించారే, కాని ఆకథలేవీ తను మాత్రం చదవలేదు.

ఒకనాడు అబ్బాయి ఇంటో లేనిసమయంలో పోష్టు బంట్రోతొచ్చి ఒకపత్రికపడేసి పోయినాడు. శాపాచలంగారు పరధ్యానంగా పత్రికవిప్పి పేజీలుతిప్పతుంటే కుమారుడిపేరు కళ్లపడ్డది. ఆయన చిరునవ్వు నవ్వుకుంటూ చదవ నారంభించాడు. కథపేరు 'మాతాత'. అబ్బాయికి మంచి ఊహాజ్ఞానం ఉండిఉండాలి. లేకపోతే వాడేతాత నెరుగును గనుకా?

చదువుతున్నకొద్దీ శాపాచలంగారి మొహం పాలిపోయింది. అబ్బాయికథలో తాత మూడు మూర్తులా శాపాచలంగారే!

---